క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలుని మాస కల్యాణం



నెమలి(గంపలగూడెం): శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి మాస కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక బృందంచే సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. 11 మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. పలువురు భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

కనులవిందుగా నంద దీపోత్సవం

గంపలగూడెం:గంపలగూడెం షిరిడీ సాయిబాబా ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి నంద దీపోత్సవం కనులవిందుగా జరిపారు. బాబా ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తులు మోసుకొంటూ నందదీపాలతో మందిరం చుట్టూ 11 ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బాబాకు విశేష పూజ, హారతి ఇచ్చారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

కాలినడకన వీరాంజనేయ స్వామి సన్నిధికి



గంపలగూడెం:ఎన్టీఆర్ కాలనీ నుంచి మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయంకు ఆరు కిలో మీటర్ల దూరం హనుమన్ భక్తమండలి ఆధ్వర్యంలో ఆదివారం కాలినడకన వెళ్లారు. 108 పర్యాయాలు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా 19వ పర్యాయం ఈవిడత భక్తులు కాలినడకన వెళ్లి స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

తిరువూరు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ నాయకుల డిమాండ్

తిరువూరు:గిరిజన మహిళపై దౌర్జన్యం చేసి ఆమె ఆత్మహత్యాయత్నానికి కారకుడైన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక రాజీవ్‌భవన్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. ఏకొండూరు మండలం గోపాలపురంలో సివిల్ వివాదంలో తలదూర్చి వార్డు సభ్యురాలైన గిరిజన మహిళ భూక్యా చంటి ఇంటిపై దౌర్జన్యం చేసి, బూతులు తిట్టి, అవమానించిన ఎమ్మెల్యే తీరుకు తీవ్ర మనస్తాపం చెందిన చంటి పురుగులమందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుగుదేశం అధిష్టానానికి తెలియదా అని ప్రశ్నించారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళాలు

తిరువూరు:జగన్నాథపురంలోని పాటిమీద దాసాంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. తిరువూరుకు చెందిన కొత్తూరు సత్యనారాయణ రావు రూ.4లక్షలు, కొత్తూరు ప్రసాదరావు రూ.1,01,116, జొన్నలగడ్డ రాంబాబు రూ.1,11,116, చిట్లూరి చంద్రశేఖర్, జగన్మోహనరావు రూ.50,116, దారా మురళీకృష్ణ రూ.50,116, న్యాయవాది కంచర్ల ముత్యప్రసాద్ రూ.25,116, గుడిమెట్ల జగన్నాథం రూ.10,116, జొన్నాడ సత్యనారాయణ, ఆండాళ్ళు రూ.10,125, దారా లక్ష్మీనారాయణ, పారిజాతం రూ.5,116, కంచి గోపాలకృష్ణ రూ.5116, దొంగల రమేష్ రూ.10,116, సోమవరపు సత్యనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణజ్యోతి రూ.5,116, యర్రంశెట్టి రవి రూ.10,226, వేముల చక్రవర్తి రూ.5,116, పరిశె మల్లికార్జునరావు రూ.5,120, దారా రామకృష్ణ రూ.10,116, సంగం కృష్ణకిషోర్ రూ.10,116, యరనూక వెంకటేశ్వరరావు రూ.5,001, నాళ్ళా కాశీ విశ్వనాథ్ రూ.11,116, పడమటి రవికుమార్ రూ.5,116, సతీష్‌కుమార్ రూ.5,116, చిలకమర్తి శివరామకృష్ణ రూ.5,116, పగిడిపల్లి గోపాలకృష్ణ రూ.5,116, నల్లబోతుల శ్రీనివాసరావు రూ.5,116, నీరుకొండ మురళీకృష్ణ రూ.5,116, కుసుమరాజుల నాగేశ్వరి రూ.5,116 విరాళాన్ని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు.

19న గిరిజన ప్రజా సమాఖ్య సమ్మేళనం

జగ్గయ్యపేటఅర్బన్:ఈనెల 19వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న గిరిజన ప్రజా సమాఖ్య సమ్మేళనానికి గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని గిరిజన సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాహోరి బద్దూనాయక్, లావుడ్యా చిట్టిబాబు కోరారు. మార్కెట్ యార్డులో సోమవారం గిరిజన ప్రజా సమాఖ్య సమ్మేళన సన్నాహక సమావేశం నిర్వహించారు. సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు.

యథేచ్ఛగా సంక్రాంతి జూదాలు



తిరువూరులో గుండాట నిర్వహిస్తున్న దృశ్యం



మూలపాడులో పందెం రాయుళ్లు నిర్వహిస్తున్న కోడి పందేలు



తిరువూరులోని ఓ బరిలో కోడి పందేలు

తిరువూరు:సంక్రాంతి జూదాలు తిరువూరు మండలంలో సోమవారం ప్రారంభమయ్యాయి. తిరువూరు, కాకర్ల, మల్లేల, అక్కపాలెం గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, కోతముక్క, లోనాబయట, పులి మేక తదితర జూదాలు యథేచ్ఛగా నిర్వహించారు. నెల రోజుల ముందు నుంచి సంక్రాంతి జూదాలకు అనుమతులు లేవని, నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఊదరగొట్టిన అధికారయంత్రాంగం ఆచూకీ కనిపించలేదు. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చిన జూదరులు, జనంతో తిరువూరు మండలంలోని బరులు కిటకిటలాడాయి. పందెం బరుల వద్ద మద్యం, బిరియానీ అమ్మకాలు సైతం సాగాయి.

జోరుగా పందేలు....

ఇబ్రహీంపట్నం:సంక్రాంతి సాంప్రదాయం పేరుతో మండలంలోని వివిధ గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, నంబర్ల ఆటలు సోమవారం జోరుగా సాగాయి. సాంప్రదాయం పేరుతో కోడిపందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన పోలీస్ అధికారులు కోడి పందేలు నిలువరించడంలో పూర్తిగా విఫలం చెందారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం, మూలపాడు, జూపూడి చినలంక, చిలుకూరు గ్రామాల్లో పందేలు యథేచ్ఛగా జరిగాయి. పోలీసులు నామమాత్రంగా పందెం శిబిరాలు సందర్శించి నిర్వాహకులతో మాట్లాడుకున్నారు. మాయాజాలంతో కూడిన జూద క్రీడలతో సామాన్యులు మోసానికి గురై నగదు పోగొట్టుకున్నట్లు వాపోయారు. శిబిరాల ప్రాంతానికే మద్యం సరఫరా చేయడంతో పందెం రాయుళ్లు తాగితూగారు. తొలిరోజు సుమారు రూ.50 లక్షల వరకు చేతులు మారి ఉంటాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

అనాథలకు సేవ చేయడం గొప్ప విషయం



నూజివీడు: అనాథ పిల్లలకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయమని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. పట్టణంలోని స్నేహారైడ్స్ అనాథ బాలల వసతి గృహాన్ని సోమవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ అనాథ పిల్లలందరినీ పలకరించారు. అనాథ బాలల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్న వసతి గృహ నిర్వాహకులు బసవరాజు నగేష్ అభినందనీయులన్నారు. మానవసేవే మాధవసేవ అనే నానుడిని నిజం చేస్తున్న నగేష్‌కు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహా రైడ్స్ సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరులో మెల్విన్ జోన్స్ జయంతి



తిరువూరు:లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి కార్యక్రమాన్ని తిరువూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన మెల్విన్ జోన్స్ సామాన్య, పేద వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని నిర్వాహకులు వివరించారు. రాజుపేట సద్గురు సాయి దివ్యాంగుల ఆశ్రమంలో నిత్యావసర సరుకులను లయన్స్ క్లబ్ సభ్యులు వితరణ ఇచ్చారు. క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగుబండి శ్యాంసుందర్, సభ్యులు కంచర్ల ముత్యప్రసాద్, నూతక్కి రాఘవరావు, కోరుకొండ గంగాదరరావు పాల్గొన్నారు.

నేత్రదానం చేసిన లింగారెడ్డి



గోసవీడు(గంపలగూడెం):మండలంలోని గోసవీడుకు చెందిన చల్లా లింగారెడ్డి(74)మంగళవారం ఇంటి వద్ద మృతి చెందారు. ఆయన కంటిచూపు సక్రమంగానే పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో నేత్రదానం ఆవశ్యకతను తిరువూరు లయన్స్‌క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఇచ్చిన సమాచారం మేర విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పటల్ డాక్టర్స్ వచ్చి కార్నియను సేకరించారు. మృతుడికి భార్య ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విశ్రాంత జీవితం సమాజానికి దిక్సూచిగా ఉండాలి

ముసునూరు: విశ్రాంత జీవితం సమాజానికి దిక్సూచిగా ఉండాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని రమణక్కపేటలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ కార్యాలయ సీనియర్ సహాయకుడు చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం చంద్రశేఖర్ దంపతులను, ఎంపీపీ దంపతులు, సహోద్యోగులు, మిత్రులు, స్థానికులు ఘనంగా సత్కరించి, నూతన వస్త్రాలు, జ్ఞాపికలను బహూకరించారు.

సందడిగా భోగి వేడుకలు

నూజివీడు: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం భోగి పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లో, పట్టణంలో పిల్లలు, పెద్దలు వేకువజాము నుంచే వీధుల్లోకి వచ్చి భోగి మంటలు వేయడంతో సందడి నెలకొంది. ఆవుపేడతో తయారుచేసిన పిడకలను భోగి మంటలలో వేసి చలికాశారు. అంతేగాకుండా ఇంట్లో పనికిరాని పాతవస్తువులను భోగి మంటలలో వేయడంతో పాటు భోగి మంటలలో కాగబెట్టిన నీళ్లను తీసుకెళ్లి పిల్లలు, పెద్దలు అభ్యంగన స్నానమాచరించి నూతన వస్త్రాలను ధరించారు. అలాగే తమ పిల్లలపై ఉన్న కీడు తొలగిపోవాలని తల్లులు తమ పిల్లలకు భోగి పండ్లు పోశారు. మహిళలు రంగురంగుల ముగ్గులతో లోగిళ్లను అందంగా తీర్చిదిద్దారు. ఆలయాలకు వెళ్లి ఇష్టదైవానికి పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా భోగి పండుగ

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముందు సుందరమైన రంగవల్లికలు తీర్చిదిద్దారు. పట్టణాల నుంచి పుట్టినింటికి తరలివచ్చిన ప్రజలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. మహిళలు పిండి వంటల తయారీలో నిమగ్నం కాగా చిన్నారులు గాలిపటాలతో సందడి చేస్తున్నారు. అలాగే కోడి పందేలు సైతం జోరుగా సాగుతున్నాయి. మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బహుమతులతో పందెంగాళ్లను నిర్వాహకులు ఆకర్షింపజేస్తున్నారు. జనార్ధనవరంలో మొదటి బహుమతి రూ.3 లక్షలు కాగా, చనుబండలో బుల్లెట్ మొదటి బహుమతిగా ఇవ్వనున్నారు.

ఇబ్రహీంపట్నం:భోగి పండుగ సంబరాలు మండలంలో ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని వీధుల్లో సాంప్రదాయంగా భోగి మంటలు వేశారు. ఇంటి ఆవరణలో ముగ్గులతో అలంకరించుకున్నారు. కాచవరంలో పారిశ్రామికవేత్త బోడేపూడి అప్పారావు ఆధ్వర్యంలో గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. వీధుల్లో వారి నివాసాల ముందు ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. న్యాయ నిర్ణేతలు వీధుల్లో తిరిగి ప్రకటించిన విజేతలకు బహుమతులు అందజేశారు.



నూజివీడులోని ఎంప్లాయిస్ కాలనీలో వేకువ జామునే భోగి మంటలు వేసిన స్థానికులు



కొండపల్లిలో స్థానికులు వేసిన భోగి మంటలు



గంపలగూడెంలో భోగి మంటలు



గొల్లపూడి భోగి వేడుకల్లో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత, బొమ్మసాని

వైభవంగా సంక్రాంతి వేడుకలు ప్రారంభం

మైలవరం: తెలుగువారి లోగిళ్లలో అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు సోమవారం ప్రారంభించారు. సాంప్రదాయ పండుగను పురస్కరించుకుని తెల్లవారు జామునే లేచి భోగి మంటలు వేసి వేడినీళ్లతో పిల్లలు, పెద్దలు తలంటు స్నానాలు చేసి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి పూజలు నిర్వహించారు. ముందుగా ఇళ్ల ముందు రంగు రంగులతో ముగ్గులు వేశారు. గ్రామాల్లో సంక్రాంతి పండుగ అంటేనే పిల్లలు, పెద్దలు, ముఖ్యంగా యువత ఆనందాలకు అంతు ఉండదు. పిండి వంటలతో సంక్రాంతి పండుగకు ఇళ్లలో ఘుమ ఘుమలు నిండాయి. మైలవరంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మైలవరం విజయవాడ రోడ్డులో కోడి పందేలు నిర్వహించారు. అలాగే మండలంలోని వెల్వడం, చంద్రగూడెం, మొర్సుమల్లి, చంద్రాల, పొందుగల తదితర గ్రామాల్లో కోడి పందేలు యథేచ్ఛగా జరిగాయి. కోడి పందేల్లో కోళ్ల రక్తంతో పందెం బిరులు తడిసి ముద్దయ్యాయి. అలాగే కోడి పందేల బరులలో మద్యం ఏరులైపారింది. జిల్లా కలెక్టర్ కోడి పందేలు చట్ట వ్యతిరేకంగా నిర్వహించవద్దని, కోడి కత్తి కట్టవద్దని ఆదేశాలున్నా బేఖాతరు చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

కోలాహలంగా భోగి

గంపలగూడెం:మూడు రోజులు నిర్వహించే సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం భోగి పండుగను మండలంలో భక్తులు కోలాహలంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున ఇళ్ల ముందు బోగి మంటల్ని భక్తులు సంప్రదాయంగా వేశారు. మహిళలు బోగి మంటల చుట్టూ చేరి పాటలు పాడారు. వాకిళ్లు ఊడ్చి బోగికుండలు, తదితర ముగ్గులు వేసి రంగులు దిద్దటంతో బజార్లు దూరప్రాంతాల నుంచి సైతం ప్రజలు తమ స్వగ్రామాలకు కుటుంబ సమేతంగా రావడంతో మండంలో పండుగ కళ కన్పించింది. సంప్రదాయ దుస్తుల్లో బాలబాలికలు ముచ్చట గొల్పారు.

ఆనందోత్సాహాలతో బోగి

తిరువూరు:మకర సంక్రాంతి పర్వదినంలో భాగంగా సోమవారం భోగి పండుగను తిరువూరు ప్రాంత ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే బోగిమంటలు వేయడంతో పాటు చిన్నారులకు బోగిపళ్ళు పోశారు. రకరకాల బొమ్మలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులకు, గోమాతకు పూజాదికాలు నిర్వహించారు. ఇళ్ల ముంగిట సందిగొబ్బిళ్ళు పెట్టి యువతులు, మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. తిరువూరు శ్రీవెంకటాచలస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయాలలో గోదాదేవి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా చేశారు.

ఘనంగా భోగి పండుగ

ముసునూరు : మండల ప్రజలు సోమవారం భోగి పండుగను సంప్రదాయకంగా జరుపుకున్నారు. యువకులు, పెద్దలు తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. మహిళలు తమ ఇంటి వాకిళ్లలో ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి, బొమ్మల కొలువులతో తెలుగు సంప్రదాయాన్ని చాటారు. గంగిరెద్దులు, హరిదాసులతో గ్రామాలు కళకళలాడాయి. మధ్యాహ్నం నుంచి కోడిపందేలు ఆరంభించారు. మండలంలోని లోపూడి, గోపవరం, కాట్రేనిపాడుల్లో భారీ స్థాయిలో కోడిపందేలు జరిగాయి. నూజివీడు, గన్నవరం, ముసునూరు, విసన్నపేట, చాట్రాయి, ఆగిరిపల్లి, లింగపాలెం మండల నేతలు, ప్రజలు కోడి పందేలను వీక్షించారు.

గొల్లపూడి గ్రామంలో భోగి వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):గొల్లపూడి వన్ సెంటర్‌లో సోమవారం వేకువ జామున భోగి మంటల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని సంప్రదాయ రీతిలో పూజలు నిర్వహించి భోగి మంటలను ప్రారంభించారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ కన్న తల్లిని, పుట్టిన గడ్డను మరువకూడదన్న నానుడి ప్రకారం వివిధ రాష్ట్రాల్లో ఉంటున్న స్థానికులు సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు సొంత ఊరుకు రావడం ముదావహమని అన్నారు. బొమ్మసాని సుబ్బారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు (నారద), నర్రా వాసు తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం



కొండపల్లిలో వేసిన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



తిరువూరు సుందరయ్య కాలనీలో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో పడేస్తున్న ప్రజలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించి స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. భోగి పండుగను పురస్కరించుకుని వేసిన మంటల్లో విద్యుత్ బిల్లులు సోమవారం దహనం చేశారు. సీపీఎం పట్టణ అధ్యక్షుడు షేక్ బాషా మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం సామాన్యులపై కరెంటు భారం మోపిందన్నారు. ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్టీ సభ్యులు బేబీ సరోజినీ, బి. వెంకటేశ్వరరావు, కృష్ణవేణి, హసీనా, తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు:కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి విద్యుత్ బిల్లులను పెంచిందని ఆరోపిస్తూ తిరువూరు సుందరయ్య కాలనీలో విద్యుత్ వినియోగదారులు కరెంటు బిల్లులను సోమవారం బోగిమంటల్లో వేసి దహనం చేశారు. పేదలపై అధిక భారం మోపుతూ ఒకేసారి ట్రూ అప్ చార్జీల పేరుతో బాదడం శోచనీయమని, కరెంటు బిల్లులు పెంచబోమని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కూటమి పాలకులు మరచారని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ సీహెచ్ శ్రీనివాస్ విమర్శించారు. విద్యుత్ బిల్లుల పెంపుపై ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. పార్టీ పట్టణ కమిటీ సభ్యులు పంతంగి శ్రీనివాసరావు, చింతయ్య, సత్యనారాయణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల పెంపుకు నిరసన

వాముకుంట్ల(తిరువూరురూరల్): విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల భారం మోపడాన్ని నిరసిస్తూ వాముకుంట్లలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కరెంటు బిల్లులు దహనం చేశారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించాలని సీపీఎం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గ్రామంలోని విద్యుత్ వినియోగదారులు, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



లోపూడిలో రంగనాథ స్వామి, గోదాదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవం



గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి, స్వామివారు

ముసునూరు: భోగి పండుగ సందర్భంగా లోపూడిలోని కోదండ రామాలయంలో గోదాదేవి, శ్రీరంగనాథ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు కిరణ్ కుమార్ స్వామి బృందం కల్యాణ క్రతువు నిర్వహించారు. సాయంత్రం దేవేరులు పుష్పమాలాంకృతులై, గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తరలివెళ్లి భక్తులకు దర్శనమిచ్చారు. ముసునూరు, చెక్కపల్లి, గోగులంపాడు, రమణక్కపేట, వేల్పుచర్ల, గుడిపాడు, గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

గంపలగూడెం: ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమంల్లో భాగంగా 29వ రోజు మంగళవారం గోదాదేవి కల్యాణాన్ని మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా జరిపారు. గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, భజనమందిరం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో అర్చకబృందంచే గోదాదేవి, రంగనాధస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కన్యస్త్రీలు పీటలపై కూర్చొని కల్యాణం చేశారు. అమ్మవారి కల్యాణం చేస్తే సంభందిత కన్యస్త్రీలు వివాహం మంచి గుణాలు ఉన్న భర్తతో వివాహం జరుగుతుందని భక్తుల విశ్వాసం.

ఆగిరిపల్లి:ధనుర్మాసం ఉత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక శోభనాచల వ్యాఘ్రు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు ప్రత్యేక పూజలు జరిపి గోదాదేవి కల్యాణ విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



కె.తాడేపల్లిలో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఈడా వేదాద్రి

కె.తాడేపల్లి(విజయవాడరూరల్):మూడు రోజుల సంక్రాంతి పండుగ సమయంలో యువతను కోడి పందేలు, జూద క్రీడలకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా ఏటా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఈడా వేదాద్రి ఇంజినీర్స్ (ఈవీఈ) ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ ఈడా వేదాద్రి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత దృష్టి కోడి పందేలు, జూదం వైపు వెళ్లకుండా ఉండేందుకే 12 ఏళ్లగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం, కొత్తూరు తాడేపల్లిలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను చైర్మన్ వేదాద్రి తన మామిడి తోటలో ప్రారంభించారు. విజయవాడ నగరంతో పాటు, విజయవాడ రూరల్, జి.కొండూరు, మైలవరం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో యువత ఈ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వీలైనంత ఎక్కువ మంది క్రీడాకారులను తయారు చేసే ఉద్దేశంతో ఏటా జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. పీవీ సింధూ, శ్రీకాంత్, వెన్నం జ్యోతి సురేఖ వంటి అంతర్జాతీయ క్రీడాకారులకు ప్రభుత్వం డెప్యూటీ కలెక్టర్ ఉద్యోగఅవకాశాలను కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలు ఉన్నారని, వారికి తగిన శిక్షణ ఇస్తే ఉత్తమ క్రీడాకారులుగా తయారవుతారని వెల్లడించారు. బ్యాడ్మింటన్ నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ సౌకర్యం కూడా కల్పించినట్లు చెప్పారు.